సింగిల్ పేజీ కథలు

# స్వార్జితం

**స్వాతి**



**ప్రకాశ్ పిహెచ్‌డీ గారు పెళ్ళి చూపులకు వెళ్లారు! ప్రకాశ్ పిహెచ్‌డీ గారు సిరమిక్ ఫ్యాక్టరీలో ఎమ్డీగా పనిచేస్తున్నారు!!**

**అందంగా వుంటారు! తల్లిదండ్రులకు ఒక్కడే కొడుకు!**

ప్రకాశ్ తల్లిదండ్రులకు ఆ ప్రాంతంలో మంచి పేరుంది -

తండ్రి నిజాయితీ పరుడిగా, సంస్కర్తగా ఆ ప్రాంతంలో పేరు తెచ్చుకున్నాడు.

వరకట్నాలకూ, అవినీతికి వ్యతిరేకంగా ఎన్నో ఉద్యమాలు లేవదీశాడు.

ఆయన కట్నం తీసుకోకుండా ఆదర్శ వివాహం కూడా చేసుకొన్నాడు.

అలాంటి సంస్కర్తల పెంపకంలో పెరిగిన ప్రకాశ్ పిహెచ్‌డీకి తమ పిల్లనివ్వడానికి అమ్మాయిలున్న తల్లి దండ్రులంతా ఎగబడ్డారు.

కారణం కట్నం తీసుకోడని -

ప్రకాశ్ పిహెచ్‌డీ గారికి అమ్మాయి నచ్చింది! ఆ విషయం అమ్మాయి తల్లిదండ్రులకు చెప్పారు.

"ముహుర్తాలు ఎప్పుడు పెట్టించ మంటారు బాబూ?" అడిగాడు అమ్మాయి తండ్రి.

"స్టేట్ ఫైనాన్స్ కార్పోరేషన్‌లో నేను తీసు కొంటోన్న లోన్‌కి మార్జిన్‌మనీ లక్ష రూపాయలు కట్టాలి! అది మీరెప్పుడిస్తే అప్పుడే..."

అక్కడున్న వాళ్ళందరూ ఖంగు తిన్నారు! ప్రకాశ్ తండ్రి కలవరపడిపోయాడు.

"మానాన్న ఆదర్శాలు నాన్నవి! నా జీవితం నాది. కట్నం తీసుకోకుండా మానాన్న సంపాదించిందేమి లేదు. నాన్నలా సాదా, సీదాగా నేను బ్రతుకలేను! ఇండస్ట్రీ పెట్టుకోవాలను కొంటున్నాను! మార్జిన్ మనీ ఇస్తే నేను మీ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాను. ఆలోచించి చెప్పండి!" అంటూ లేచాడు.

అమ్మాయి ముఖం అవమానంతో కంది పోయింది.

ప్రకాశ్ తండ్రి కృష్ణయ్య పేలవంగా నవ్వుకున్నాడు:

"తన పెళ్లయి ఇరవై సంవత్స రాలయింది! ఈ ఇరవై సంవత్సరాల్లో సమాజం ఎంతగా అభివృద్ధి చెందిందో తన కొడుకే సాక్ష్యం!" అనుకున్నాడు. ❋ ❋ ❋

# నివేదిక



"మమ్మీ ! పాలన్నీ ఏమిటో చేదుగా వున్నాయి. నాకీ పాలు వద్దు"

"పాలు చేదేమిటే పిచ్చి దానా! పాలలో చక్కెర కలుపుకో లేదేమో"

"కలిపాను మమ్మీ! అయినా పాలు చేదుగానే ఉన్నాయి! బహుశా చక్కెరే చేదుగా వుందేమో!"

"నీ ముఖం! నాకు తెలుసు త్రాగడం ఇష్టం లేకే నీ నాటకాలన్నీ. నోరు మూసుకుని త్రాగు"

"నిజం మమ్మీ! చక్కెర చేదుగా వుంది! కావాలంటే రుచి చూడు" మళ్ళీ చెప్పింది పాప.

తల్లి కొంచెం నోట్లో వేసుకుంది. చక్కెర చేదు. భర్తకు కొంచెం పెట్టింది. చక్కెర చేదు.

భర్త చక్కెర తీసుకొని షాప్ కెళ్ళాడు కోపంగా.

షావుకారు నోట్లో వేసుకున్నాడు. చేదు.

షావుకారు తన దగ్గరున్న చక్కెర మొత్తం తీసుకొని హోల్ సేల్ వ్యాపారి దగ్గరకు వెళ్ళాడు. ఆ వ్యాపారి కూడా చక్కెర రుచి చూసాడు. చేదు.

వ్యాపారస్తులందరూ కలిసి జిల్లా కలెక్టర్ దగ్గరికి వెళ్ళారు. కలెక్టర్ రుచి చూసాడు. చక్కెర చేదు.

'చక్కెర చేదు' విషయంలో నిపుణుల కమిటీ' ని వేస్తానని జిల్లా కలెక్టర్ ప్రకటించాడు.

నాలుగు రోజుల తరువాత నిపుణుల కమిటీ నివేదిక వచ్చింది.

'చక్కెర చేదుగా లేదు. చక్కెర చేదని చెప్పిన వాళ్ళ నాలుకనూ, నోటినీ, డాక్టర్‌తో పరీక్ష చేసుకుంటే మంచిది' అని...

ప్రజలు నోరు తెరిచారు.

ఇహ నిపుణుల కమిటీ నివేదికను ఎవరు కాదంటారు? వారు... మేధావులు... దేశభక్తులు!

★ ★ ★